క్లుప్తంగా

శివాలయంలో ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూల విగ్రహాలకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుండ్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కుసుమ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరంలో రోగులకు ఆయా విభాగాల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గౌహతిరెడ్డి

పూతలపట్టు: మండలంలోని అనంతాపురం గ్రామం సమీపంలో సోమవారం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకురాలు గౌహతిరెడ్డి భూమిపూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనుల కోసం ఎంపీ గ్రాంటు ద్వారా రూ.5లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాసిలామణి, పద్మజారాణి, త్యాజరాజ్, సుధీర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


మండల నూతన కమిటీ సభ్యులు

బంగారుపాళెం: ఏపీ డ్రైవర్స్‌అండ్ క్లీనర్స్ అసోషియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కుమార్ నివాస గృహం ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడుగా చెంచుబాబు, ఉపాధ్యక్షుడుగా ఖాదర్‌బాషా, కోశాధికారిగా వెంకటేష్, కార్యదర్శిగా సుధాకర్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేయడంలో డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెరియంబాడి నాగరాజు తెలిపారు. చెన్నై ఎంఎన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణప్రకాష్

తవణంపల్లె: ఆరోగ్య హెల్త్ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణప్రకాష్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. కులగణన సర్వే ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి లక్ష్యాన్ని అందుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పల్లె ముంగిట్లో రైతు సేవ


రైతులకు ఎరువులు అందజేస్తున్న ఆర్బీకే సిబ్బంది (ఫైల్)


పంట పరిశీలనలో వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

రైతులకు అవసరమైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకే వ్యవస్థను పల్లె ముంగిటకే తీసుకొచ్చింది. ఫలితంగా రైతులు పొలిమేర దాటకుండానే విత్తనం నుంచి విక్రయం వరకూ అన్నీ అందుబాటులోకి వచ్చాయి. నాసిరకం విత్తనాలు ఊసే లేకుండా పోయాయి. ఎరువుల కోసం లాఠీ దెబ్బలు తినేరోజులు పోయాయి. పేరు చెబితే ఎరువులు పొలంలోకి వచ్చేస్తున్నాయి. ఇంత సాయం చేసిన జగనన్న రైతుల గుండెల్లో కొలువైపోయారు.

- రైతులకు అందుబాటులో ఆర్‌బీకే
- పొరుగు రాష్ట్రాల్లో ఎరువుల కొనుగోలుకు బ్రేకులు
- తుమ్మిందలో రైతు భరోసా కేంద్రానికి రైతుల తాకిడి
- పెరిగిన పంట సాగు, పశుసంపద

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద సచివాలయం కింద తుమ్మింద, తొప్పాతి అనే రెండు పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 12 గ్రామాలు ఉండగా, 1021 రైతు కుటుంబాలున్నాయి. మొత్తం 2212.52 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా మామిడి 1012 ఎకరాలు, వేరుశనగ 650 ఎకరాలు, వరి 50 ఎకరాలు, బొప్పాయి 45 ఎకరాల్లో పండిస్తున్నారు. వీటి సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

నాడు ఇలా...

గతంలో వరుణుడి కరుణ లేదు. అప్పట్లో అంతంతమాత్రమే కురిసే వర్షానికి రైతులు భూములను బీడుగా పెట్టుకోలేక అష్టకష్టాలు పడి పంటలు పండించేవారు. నీరందించేందుకు ఆకాశం వైపు చూసేవాళ్లు. ఇక ఎరువులు, మందులు ఇక్కడివి నాసిరకమని తమిళనాడులోని వేలూరు, పరదరామి ప్రాంతాలకు పరుగులు పెట్టేవారు. దీంతో రైతులకు రవాణా భారం అధికమయ్యేది. తెగుళ్లు వ్యాపిస్తే వ్యవసాయ అధికారుల కోసం వెతుకులాటలో పడేవారు. రాయితీ విత్తనాలు ఇచ్చేవారు కారు. ఇచ్చినా అవి అరకొరగా మాత్రమే అందేవి. పాడి రైతులకు సకాలంలో పశువైద్యం అందక పాడి సంపదను కోల్పోయారు.

నేడు ఇలా...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేలు వచ్చాక, రైతుల బాధలు తప్పాయి. రైతుకు అవసరమైన విత్తనాలు రాయితీతో ఇస్తున్నారు. ఎరువులు, మందులు పల్లెలోనే అందుతున్నాయి. అవి కూడా నాణ్యతలో భేష్ అనిపించుకుంటున్నాయి. రవాణా భారం తగ్గింది. ఎరువులు, మందుల కోసం తమిళనాడులోని ప్రాంతాలకు వెళ్లాల్సిన పని తప్పింది. బుకింగ్ చేసుకున్న రోజు నుంచి వారం రోజుల్లో కావాల్సిన ఎరువులు గ్రామానికే చేరుస్తున్నారు. పంటలకు తెగుళ్లు వ్యాపిస్తే తక్షణంగా రైతు భరోసా కేంద్ర సిబ్బంది పంట వద్దకు పరుగులు పెడుతున్నారు. తగిన సూచనలు అందించి పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పంట పండించే రైతులను ప్రోత్సాహించేందుకు పెట్టుబడి నిధి అందిస్తోంది. పంటకు బీమా, విపత్తుల సమయంలో ఆర్థికసాయం వంటివి అందిస్తోంది. కేంద్రంలోనే భూసార పరీక్షలు చేసి ఫలితాలను అందిస్తున్నారు. డ్రిప్ పరికరాలను ఇక్కడి నుంచే పంపిణీ చేస్తున్నారు. పాడిపరిశ్రమ వృద్ధి కనిపిస్తోంది. తుమ్మింద ఆర్బీకే పరిధిలో ప్రస్తుతం 900 పాడి ఆవులు ఉండగా 2వేల లీటర్ల వరకు పాలసేకరణ జరుగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

తుమ్మిందలో వినియోగం అధికం

వైఎస్సార్ రైతు భరోసా కింద 821 కుటుంబాలకు ప్రతి ఏటా రూ.13,500 చొప్పున మొత్తం రూ.1.10కోట్లు మంజూరవుతోంది. పంట బీమా 831 మందికి గాను రూ.13.24 లక్షలు, విపత్తుల సమయంలో 106 మంది రైతులకు రూ.5,65,387, 1748 మంది రైతులకు గాను వివిధ రకాల రాయితీ విత్తనాలు 699.48 క్వింటాళ్లు, 1800 మంది రైతులకు వేరుశనగ 689.9 క్వింటాళ్ల చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు. పాడిపరిశ్రమకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. కట్టర్, ఫీడ్ వంటివి రాయితీతో ఇస్తున్నారు.

ఉచితంగా బీమా



గతంలో పంట బీమా కోసం మేమే ప్రీమియం చెల్లించేవాళ్లం. బీమా పరిహారం కూడా సరిగా వచ్చేది కాదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సిబ్బంది ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారు. ప్రభుత్వమే రైతుల తరపున బీమా ప్రీమియం చెల్లించి, పంట పరిహారం సకాలంలో చెల్లిస్తోంది.

–శేషాద్రి, మర్రిగుంట, తొప్పాతి

బాధలు తప్పాయి



పాడి పశువులే మాకు జీవనాధారం. గతంలో ఆవులకు ఏమైనా సమస్య వస్తే ఎంతో కష్టపడి చిత్తూరుకు తీసుకెళ్లేవాళ్లం. ఇప్పుడు సిబ్బంది మా ఇంటి వద్దకు వచ్చి పశువుల బాగోగులు చూస్తున్నారు. వాటికి కావలసిన టీకాలు ఇక్కడే ఇస్తున్నారు. ప్రస్తుతం పాడి సంపదని సులభంగా కాపాడుకుంటున్నాం.

–లక్ష్మి, తుమ్మింద

స్పందన వినతులను వేగంగా పరిష్కరించండి


ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వినతులు స్వీకరించారు. ప్రజలు పలు సమస్యలపై కమిషనర్‌కు వినతులు అందించారు. అందిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన వినతులపై అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేక పూజలు


హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయ వార్షిక మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం హోమ పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. తదనంతరం భక్తులకు స్వామి ప్రసాదం, పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.

ఎవరైనా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవాల్సిందే


కట్టమంచిలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కుమ్మక్కై వచ్చినా జగనన్న ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అవన్నీ ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవాల్సిందేనని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక కట్టమంచిలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని ప్రజలు ఫ్యాన్‌కు ఓటు వేయాలని కోరారు. ఇటీవల మరణించిన ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ధీరజ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి కట్టమంచి అభివృద్ధి సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. సొంత నిధులతో సాంబయ్యకండ్రిగ వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టడంపై ప్రాంత వాసులు విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కట్టమంచి ప్రాంతంలో ఐక్యత ఎక్కువని అందరూ కలిసి ఎవరిని గెలిపించాలో ముందుగా నిర్ణయించుకుంటారన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్లు స్వరూపరాణి, హరిణిరెడ్డి నాయకులు మనోహర్‌రెడ్డి, కట్టమంచి బాబీ, చిరంజీవి, శేఖర్, వినోద్, సోమశేఖర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, మనోజ్‌రెడ్డి, రజనీ, చిట్టి,హరి, దీన, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

స్థానిక వైఎస్సార్‌కాలనీలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని ఆపార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని ఇన్ని రోజులు పడిన కష్టం కంటే ఎక్కువగా కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శోభ, నాయకులు శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్ సోమవారం రాత్రి విజయానందరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై మాట్లాడారు.

ఐరాల తహసీల్దార్‌గా శ్రీనివాసులు

ఐరాల: స్థానిక కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌గా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ సుశీలమ్మ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గడివేములలో పని చేస్తున్న శ్రీనివాసులు ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

చిత్తూరు తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్‌గా సోమవారం శ్రీనివాసరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను డీటీలు కిరణ్, ధనుంజయ పుష్పగుచ్ఛం అందించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

జిల్లా స్టోర్స్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను సోమవారం ఆ శాఖ పీఅండ్ఎస్ఎం సీజీఎం చలపతి పరిశీలించారు. విద్యుత్ పరికరాల నిల్వ వాటి రిజిస్టర్, వివరాలను ఆరా తీశారు. సకాలంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయాలని కోరారు. జగనన్న కాలనీలకు అవసరమైన విద్యుత్ పరికరాల స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకొని సకాలంలో ఇవ్వాలని చెప్పారు. అవసరమైన విద్యుత్ పరికరాలను తెప్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈలు జయప్రకాష్, జ్ఞానేశ్వర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు


తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డిని సత్కరించి వీడ్కోలు పలుకుతున్న రెవెన్యూ అధికారులు

తవణంపల్లె: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి చిత్తూరు కలెక్టరేట్‌లోని సి సెక్షన్‌కు బదిలీ అయ్యారు. దీంతో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి సోమవారం తన బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు అప్పగించి రిలీవ్ అయ్యారు. గుణశేఖర్ రెడ్డిని డిప్యూటీ తహసీల్దార్ నరేష్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు శాలువ కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తవణంపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన నరేష్‌కు రెవెన్యూ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

పోటీతత్వం ఉండాలి

తవణంపల్లె: విద్యార్థుల్లో పోటీతత్వం కలిగి ఉండాలని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి అన్నారు. అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం నర్సింగ్ కళాశాలలో ఫౌండర్స్ డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మండలంలోని ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడారు.

రైల్వే క్రాసింగ్ మూసివేత

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు–మురకంబట్టు రైల్వే క్రాసింగ్ గేటును మరమ్మతు పనుల కారణంగా తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు మురకంబట్టు రైల్వే క్రాసింగ్ గేటును మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు, వాహనదారులు మార్పును గమనించి, సహకరించాలని అధికారులు కోరారు.

ఏనుగుల దాడి: పంటల ధ్వంసం

సోమల: ఏనుగులు పంటలపై దాడులు చేసి నష్టం కలిగించాయి. ఆదివారం రాత్రి మండలంలోని నెల్లిమంద పంచాయతీ కమ్మపల్లెకు చెందిన బాషా సాహెబ్, సోమల సమీపంలోని ముండ్రివారిపల్లెకు చెందిన కృష్ణయ్య, చెన్నయ్యగారిపల్లె సమీపంలోని గొల్లపల్లెకు చెందిన సోమశేఖర్, భాస్కర్, రెడ్డెప్పలకు చెందిన మొలక దశలో ఉన్న వరి పైరుపై ఏనుగులు నడుచుకుంటూ వెళ్లడంతో వాటి పాద ముద్రలు పడినచోటులోని పంట దెబ్బతింది. పొలాల గట్లపై ఉన్న అరటిచెట్లను తొండంతో పెకలించివేశాయి. ఇవి గ్రామాలకు సమీపంలో సంచరిస్తుండడంతో పాటు వాహనాలు తిరిగే ప్రధాన రహదారుల మీదుగా వెళ్తుండడంతో వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల భారి నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.


గొల్లపల్లెలో గజరాజులు విరిచేసిన అరటిచెట్టు

14న తిరుపతిలో ఉచిత అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్: తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం, చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం సంయుక్తంగా వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 14న రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో పిల్లలకు ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కె శేషగిరి రావు తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, సరస్వతి హోమం చేపట్టి అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తామని తెలిపారు. అలాగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బాసరలో సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పించే కంకణాలు అందజేస్తామన్నారు. ఇందులో పాల్గొన దలచిన వారు ఈ నెల 13వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9985532447, 6301192026, 9440271154లో సంప్రదించాలని తెలియజేశారు. పద్మావతి, సుబ్బారావు, రామకృష్ణ, కామేశ్వరరావు, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. జంక్‌ఫుడ్, నిలువ ఉంచిన పిండిపదార్థాలు తినకూడదని సూచించారు. శీతాకాలం ఉదయం సమయంలో తప్పనిసరిగా మాస్కు ధరించాలని దాని ద్వారా నెమ్ముతో కూడిన సమస్యలు దరి చేరవని చెప్పారు. ఎత్తు, బరువు పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న విద్యార్థులకు మందులు అందజేశారు.

వైద్యసేవలను వినియోగించుకోండి

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. తిమ్మయ్యపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాలకు వచ్చే ప్రజల వద్దకే వైద్య సేవలు వస్తున్నాయని చెప్పారు. అనంతరం షుగర్, బీపీ, గర్భిణులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, దివ్య, శిల్ప, సరిత, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

తవణంపల్లె: పల్లెలోని ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలందిస్తామని వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రం, చెర్లోపల్లె గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పుణ్యసముద్రంలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులకు, పిల్లలకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు చెర్లోపల్లె సచివాలయం పరిధిలోని రోగులకు పరీక్షలు చేయించి వైద్యం చేయించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు సుమియా, నిఖిల, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, ఏఎస్ఎంలు నీరజ, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, రోగులు



ఐరాల: రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, తవణంపల్లె: పుణ్యసముద్రంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక